హాకర్స్ జోన్‌కు మోక్షమెప్పుడో!


బీఆర్‌టీఎస్ రహదారిలో నిర్వహిస్తున్న వ్యాపారాలు


రోడ్డుపై నిలిపిన వాహనాలు

- 28 ఏళ్ల కిందట దుకాణాల నిర్మాణం
- నేటికీ వినియోగంలోకి తీసుకురాని జీవీఎంసీ అధికారులు
- అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారడంతో స్థానికుల భయాందోళనలు
- రోడ్లపైనే వ్యాపారాలతో ట్రాఫిక్ సమస్యలు

కంచరపాలెం : బీఆర్‌టీఎస్ పనులు పూర్తయితే ట్రాఫిక్ సమస్యకు చెక్ పడుతుందనుకున్న స్థానికుల ఆశలపై అధికారులు నీళ్లు జల్లారనే చెప్పుకోవాలి. ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు తోపుడుబళ్లు, ఫుట్‌పాత్ వ్యాపారులను ఒకే చోటుకు తీసుకురావాలనే ఉద్దేశంతో కంచరపాలెం నేతాజీ వంతెన కింద నిర్మించిన వాణిజ్య సముదాయం (హాకర్ల జోన్) నిరుపయోగంగా మారింది. 28 ఏళ్ల క్రితం నగర పాలక సంస్థ వాణిజ్య సముదాయం నిర్మించింది. ఏళ్లు గడుస్తున్నా వాణిజ్య సముదాయ దుకాణాలు తెరుచుకోలేదని వ్యాపారులు, స్థానికులు ఆరోపిస్తున్నారు. మౌలిక వసతులు కల్పించకపోవడంతో వ్యాపారులు ముందుకు రావడంలేదనే విమర్శలు ఉన్నాయి. మరోవైపు బీఆర్‌టీఎస్ రోడ్డు పైనే అనేక మంది వ్యాపారాలు చేస్తున్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతున్నా పట్టించుకునే నాథుడే కనిపించడం లేదని స్థానికులు వాపోతున్నారు. హాకర్‌జోన్ వినియోగంలోకి తెస్తే ట్రాఫిక్ సమస్య తలెత్తదంటున్నారు. రహదారి పనులు పూర్తయితే హాకర్ల జోన్ వినియోగంలోకి తెస్తామన్న అధికారులు... బీఆర్‌టీఎస్ వినియోగంలోకి వచ్చినా ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు. సంబంధిత అధికారులు హాకర్స్ జోన్ వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.


అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారిన దుకాణాలు

అసాంఘిక కార్యక్రమాలకు నిలయం

కంచరపాలెం నేతాజీ వంతెన కింద నిర్మించిన దుకాణాలు ఖాళీగా ఉండడంతో రాత్రి సమయాల్లో అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారాయని స్థానికులు వాపోతున్నారు. ఖాళీగా ఉన్న దుకాణాల వద్దకు గంజాయి, మత్తు సేవించే మందుబాబులు చేరుతున్నారని ఆందోళన చెందుతున్నారు. పగటి పూట సమీప రామ్మూర్తిపంతులుపేట, కంచరపాలెం ప్రాథమిక ఉన్నత పాఠశాలల విద్యార్థినులను ఆకతాయిలు వేధిస్తున్నారని ఆరోపిస్తున్నారు. స్థానికులు మందుబాబులను మందలిస్తే కొట్లాటకు దిగుతున్నారు. కంచరపాలెం గాంధీనగర్ వాసులకు ప్రధాన రహదారి కావడంతో కాలనీ వాసులు రాకపోకలు సాగించేందుకు ఆందోళన చెందుతున్నారు.


28 సంవత్సరాలుగా నిరుపయోగంగా ఉన్న వాణిజ్య సముదాయం

బీఆర్‌టీఎస్ రహదారుల పైనే వ్యాపారాలు

నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో రోడ్ల పైనే వ్యాపారాలు చేస్తున్నారు. సమీపంలోని పాఠశాల జరిగే సమయంలో రామ్మూర్తిపంతులపేట, కా.కాలనీ, కంచరపాలెం ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు విడిచిపెట్టినపుడు ట్రాఫిక్ సమస్య జటిలమవుతోంది. మరోవైపు ఖాళీగా ఉన్న వాణిజ్య సముదాయం అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. సంబంధిత అధికారులు స్పందించి దుకాణాలను వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

భయాందోళనలతో రాకపోకలు

వంతెన కింద ఖాళీ దుకాణాల్లో గంజాయి బాబులు, ఆకతాయిల ఆగడాలతో ఆందోళనతో కాలనీ ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. ఆడపిల్లలు ఇటుగా రాకపోకలు చేస్తుంటే ఆకతాయిలు ఇబ్బందులకు గురి చేస్తున్నారు. మా పిల్లలకు ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళనగా ఉంది. అధికారులు స్పందించి దుకాణాలు ప్రారంభించాలి.

– కె.శ్రీనువాసరావు, గాంధీనగర్, కంచరపాలెం

రోడ్లపైనే వ్యాపారాల నిర్వహణ

హాకర్స్ జోన్ ఏర్పాటు చేయకపోవడంతో బీఆర్‌టీఎస్ రహదారిలో చిరు, చిల్లర వర్తక వ్యాపారులు రోడ్డును ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్నారు. వాహనాలు, పాదచారుల రాకపోకలకు ఇబ్బందికరంగా ఉంటుంది. వాణిజ్య సముదాయంలో దుకాణాలు ప్రారంభిస్తే ట్రాఫిక్ నియంత్రణ సాధ్యమవుతుంది.

– భీశెట్టి ఆనంద్, గవర కంచరపాలెం.

మహిళల రక్షణకు కృషి


పింక్ ఆర్మీని ప్రారంభిస్తున్న నాదెళ్ల జ్యోతి, టాటర్ జైన్

సీతంపేట : గ్లోబల్ పింక్ ఆర్మీ విశాఖ శాఖను ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధి కొత్తపల్లి జ్యోతి మాట్లాడుతూ గ్లోబల్ పింక్ ఆర్మీని సింధు మంగళవేద స్థాపించారని తెలిపారు. కేరళ, కర్ణాటక రాష్ట్రాల్లో సేవలందిస్తున్నట్లు తెలిపారు. మహిళలు తమను తాము ఎలా రక్షించుకోవాలి, ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై పింక్ ఆర్మీ అవగాహన కల్పిస్తుందన్నారు. పాఠశాల స్థాయి నుంచి విశ్వవిద్యాలయ స్థాయి వరకు కళాశాల ప్రాంగణాల్లో మహిళల భద్రతకు, హింసను నివారించేందుకు చట్టపరంగా ఉన్న అవకాశాలను వివరిస్తూ అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో విశాఖ పార్లమెంట్ బీజేపీ కార్యదర్శి నాదెళ్ల జ్యోతి, గ్లోబల్ పింక్ సహ వ్యవస్థాపకుడు దీకప్ టాటర్ జైన్, రేంజర్ ఫోర్స్ చారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ శిడగం నాగేంద్రబాబు, సబ్ ఇన్‌స్పెక్టర్ కె.నాగలక్ష్మి పాల్గొన్నారు.

రోడ్డు మధ్యలో పశువులు


రాకపోకలకు అడ్డంగా నిలిచిన పశువులు

ఏయూ క్యాంపస్ : రహదారి మధ్యలో రెండు పశువులు ప్రమాదకరంగా నిలిచాయి. వాటిని తప్పించుకుని ముందుకు సాగేందుకు అటుగా వెళ్లే వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఈ దృశ్యం పెదవాల్తేరు నుంచి సిరిపురం వెళ్లే మార్గంలో దర్శనమిచ్చింది. నిత్యం రద్దీగా ఉండే రూరల్ ఎస్పీ కార్యాలయం చేరువలో రోడ్డుపై ఇష్టారాజ్యంగా పశువులు సంచరిస్తున్నాయి. అధికారులూ స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

క్లుప్తంగా

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన


శిబిరంలో పరీక్షిస్తున్న వైద్యులు

సీతంపేట : వాకర్స్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకులు సుంకరి అల్వార్‌దాస్ 22వ వర్ధంతి సందర్భంగా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో మురళీనగర్‌లో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. క్లబ్ అదనపు ప్రధాన కార్యదర్శి రాళ్లపల్లి సత్యనాథం శిబిరాన్ని ప్రారంభించారు. ఓమ్ని ఆస్పత్రి వైద్య బృందం వైద్య సేవలు అందించారు. బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. ఎముకల వైద్య నిపుణులు, జనరల్ ఫిజీషియన్లు బి.మోహన్‌కల్యాణ్, కె.కె.నాయుడు సుమారు 127 మందికి వైద్య సేవలందించారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు బుచ్చయ్య, కె.ద్వారకానాథ్, ఎస్.సీతారామకృష్ణ, వై.త్రిమూర్తులు, యు.అప్పలకొండ, నారాయణస్వామి, సనపల భాను, ప్రసాదరావు, ఎన్.ప్రకాశరావు, రోణంకి నాగేశ్వరరావు, వర్మ తదితరులు పాల్గొన్నారు.

యోగి వేమనకు ఘన నివాళి


వేమన విగ్రహానికి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ పద్మారెడ్డి, తదితరులు

సీతమ్మధార : జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెం ఇందిరాగాంధీ పార్క్ ఆవరణలోని యోగి వేమన విగ్రహానికి కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం నివాళులర్పించారు. రేసపువానిపాలెం, నక్కవానిపాలెం, క్రాంతినగర్, గాంధీనగర్ పెద్దలు వేమన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం స్థానిక ప్రజలకు పండ్లు పంపిణీ చేశారు.

పప్పు దోసకాయలకు గిరాకీ


రైతుబజార్‌లో విక్రయిస్తున్న దోసకాయలు

సీతమ్మధార : సీతమ్మధార రైతు బజారులో పప్పు దోసకాయలకు గిరాకీ పెరిగింది. ఈ దోసకాయలు విభిన్న రంగుల్లో వినియోగదారులను ఆకట్టుకుంటున్నాయి. ఈ కాయలను కిలో రూ.35 వంతున విక్రయిస్తున్నారు. పెందుర్తి మండలం చింతగట్లకు చెందిన రైతు ముత్యాలమ్మ సీతమ్మధారలో గల రైతు బజార్లో విక్రయిస్తున్నారు. ఈ బజారులో దోసకాయల రైతులు అందరూ కలిపి రోజుకి సుమారుగా 50 కిలోల వరకు సరకు విక్రయిస్తున్నారని సిబ్బంది తెలిపారు. వంటలో పప్పుతో కలిపి దోసకాయ వినియోగించడం తెలిసిందే. వినియోగదారులు అధిక సంఖ్యలో పప్పు దోసకాయలను కొనుగోలు చేశారు.

కనకమహాలక్ష్మి ఆలయంలో ఆయుష్ హోమం


హోమం నిర్వహిస్తున్న వేదపండితులు, అర్చకులు

దాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి అమ్మవారు జన్మించిన ఉత్తరా నక్షత్ర పుణ్యకాలాన్ని పురస్కరించుకుని ఆదివారం ఆయుష్ హోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థాన అధికారులు, వేదపండితులు, అర్చకులు పాల్గొన్నారు.

ఆకుకూరలు విక్రయించే రైతులకు ఇబ్బందులు

పట్టించుకోని మార్కెటింగ్ శాఖ అధికారులు


సీతమ్మధార రైతు బజారులో ఆకుకూరల రైతులకు వరుసగా కేటాయించిన స్టాళ్లు

సీతమ్మధార : స్థానిక రైతుబజార్‌లో ఆకుకూరల రైతులకు కొత్త కష్టాలు వచ్చి పడ్డాయని ఆందోళన వ్యక్తమవుతోంది. ఇక్కడ ఆకుకూరలు విక్రయించే రైతులకు వరుసగా ఒకేచోట స్టాళ్ల కేటాయించడం తీవ్ర దుమారం రేపుతోంది. రైతుబజార్‌లో మొత్తం 30 మంది వరకు ఆకుకూరలు విక్రయించే రైతులున్నారు. ఒక రోజు 15 మంది, మరో రోజు 15 మంది వంతున రైతులు ఇక్కడికి వస్తుంటారు. వీరందరికీ ఒకే చోట పక్కపక్కనే స్టాళ్ల కేటాయించడం గమనార్హం. ఫలితంగా ఎవరికీ సక్రమంగా బేరాలు ఉండడం లేదని ఆందోళన చెందుతున్నారు. బజారు నలుమూలలా రొటేషన్ ప్రకారం స్టాళ్ల కేటాయించాలని కోరుతున్నారు. బజారులో ఇలా జరుగుతున్నా సరే జిల్లా మార్కెటింగ్‌శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. ఒకేచోట ఆకుకూరల రైతుల స్టాళ్ల ఉండడంతో చాలా మంది వినియోగదారులు ఇతర ప్రాంతాల్లో ఆకుకూరలు కనిపించలేదని వెళ్లిపోతున్నారని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఫలితంగా తమకు గిట్టుబాటు కావడం లేదని వాపోతున్నారు. రైతుబజార్ సిబ్బంది, జిల్లా మార్కెటింగ్‌శాఖ అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని ఆకుకూరల రైతులు కోరుతున్నారు.

22న అక్కయ్యపాలెం పరస


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న గౌరీ సేవా సంఘం అధ్యక్షుడు కొయిలాడ వేణుగోపాల్, తదితరులు

సీతంపేట : గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో 22న బుధవారం భూలోకమాంబ, ముత్యమాంబ, కుంచుమాంబ, వెంకటేశ్వరస్వామి, సీతారాముల పరస మహోత్సవం అక్కయ్యపాలెంలో ఘనంగా నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను ఆదివారం సాయంత్రం అక్కయ్యపాలెం మూడు గుళ్ల వద్ద సంఘం అధ్యక్షుడు కొయిలాడ వేణుగోపాల్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆ రోజు ఉదయం 5 గంటలకు అమ్మవార్ల ప్రథమ పూజతో పరస ఉత్సవం ప్రారంభమవుతుందన్నారు. సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 11 వరకు తప్పెట గుళ్లు, సేవా గరిడీ, కోలాటం వంటి అనేక సాంస్కృతిక కార్యక్రమాలు, విద్యుత్ దీపాలంకరణతో పరస కనులపండువగా నిర్వహిస్తామన్నారు. ప్రజలంతా పాల్గొని అమ్మవార్లను దర్శించుకుని, పరసను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు పి.ఎస్.జె.వి.ప్రసాద్, కమిటీ ఛైర్మన్ రాజగిరి అప్పలరాజు, వైస్ ఛైర్మన్ మళ్ల త్రినాథరావు, డిప్యూటీ ప్రెసిడెంట్ పిళ్లా పకీరునాయుడు, కార్యదర్శి ఆడారి పారుపల్లి రవి, ఉపాధ్యక్షుడు బొడ్డేటి ఆనందరావు, కోశాధికారి పెంటకోట సత్యప్రసాద్, పిల్లా గోపి, పాలమరశెట్టి ఈశ్వర అప్పారావు, మాదేటి శ్రీనివాసరావు, వీరుబాబు, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ములాఖత్‌కు వెళ్లే వారు నిబంధనలు పాటించాలి



కేంద్ర కారాగారం ద్వారం వద్ద ఏర్పాటు చేసిన బోర్డు

ఆరిలోవ : కారాగారంలో ఖైదీలను కలవడానికి ములాఖత్ కోసం వెళ్లే వారు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని జైల్ అధికారులు పేర్కొన్నారు. ఈ మేరకు విశాఖ కేంద్ర కారాగారం అధికారులు నియమ నిబంధనలతో కూడిన హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. లోపల ఉన్న ఖైదీలకు నిషేధిత వస్తువులు అందించకూడదని అందులో పేర్కొన్నారు. ఇంకా ఏం చెప్పారంటే...

- కేంద్ర హోం శాఖ నిబంధనల ప్రకారం ఖైదీని కలవడానికి ములాఖత్ కోసం వెళ్లే వారు ఆధార్ కార్డు చూపించాలి. దరఖాస్తుకు ఆధార్ కార్డు జెరాక్స్ జత చేయాలి.
- ఒక ముద్దాయితో మాట్లాడడానికి చిన్న పిల్లలకు మినహా ఒకసారి ముగ్గురికి మాత్రమే అవకాశం ఉంటుంది.
- వారానికి రెండుసార్లు మాత్రమే ములాఖత్ ఉంటుంది.
- ముద్దాయితో మాట్లాడుతున్న సమయంలో ములాఖత్‌కు వెళ్లే వారి వద్ద ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు ఉండకూడదు.
- ఖైదీలకు నేరుగా నగదు ఇవ్వకూడదు. జైల్ గేటు వద్ద సిబ్బందికి డబ్బులు ఇస్తే ఆ ఖైదీ ఖాతాలో జమ చేస్తారు.
- గంజాయి, ఖైనీ, బీడీలు, సిగిరెట్లు తదితర నిషేధిత వస్తువులు ముద్దాయిలకు ఇవ్వకూడదు.

సీసీ కెమెరాలతో పర్యవేక్షణ

నిషేధిత వస్తువులు జైలు లోపలకు వెళ్లనీయకుండా చర్యలు చేపడుతున్నామని జైల్ సూపరింటెండెంట్ ఎం.మహేష్‌బాబు తెలిపారు. ఇందులో భాగంగా ఖైదీలను కలవడానికి ములాఖత్ కోసం వచ్చిన వారి బంధువులు, స్నేహితులు నిషేధిత వస్తువులు ఇవ్వకూడదని తెలియజేస్తూ ప్రకటన బోర్డులు ఏర్పాటు చేశామన్నారు. బయట నుంచి లోపలకు గంజాయి, బీడీలు, ఖైనీ తదితర వస్తువులు వెళ్లకుండా ఖైదీల బేరక్‌ల వద్ద కూడా నిఘా పెట్టినట్లు తెలిపారు. సీసీ కెమెరాల ద్వారా ప్రతీ క్షణం పర్యవేక్షిస్తున్నామని తెలిపారు.

ప్లాస్టిక్ ఫ్రీ వైజాగ్ అవగాహన పోస్టర్ ఆవిష్కరణ

దాబాగార్డెన్స్: ప్లాస్టిక్ ఫ్రీ వైజాగ్ అవగాహన పోస్టర్‌ను జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ ఆదివారం ఆవిష్కరించారు. జీవీఎంసీ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ ఫ్రీ వైజాగ్ అంశంపై కళాకారుడు వైకే రాజు తన కళా బృందం కళాకారులచే అవగాహన కల్పించనున్నారు. ఈ నేపథ్యంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం, ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయ వస్తువులు, కాలుష్యం, గుడ్డ, నార, పేపర్ సంచుల ఉపయోగం, పర్యావరణ పరిరక్షణ, పరిసరాల పరిశుభ్రత, ప్లాస్టిక్ రహిత విశాఖకు సంబంధించి ఈ కళాబృందం అవగాహన కల్పించనుంది. జానపద గీతాలతో ప్రజలను చైతన్య పరిచేందుకు ఈ బృందం నగర నలుమూలల అవగాహన కల్పించనుంది. అదనపు కమిషనర్ ఆర్.సోమన్నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

అల్లర్లు సృష్టిస్తే రౌడీషీటర్లపై కఠిన చర్యలు


రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ చేస్తున్న ఫోర్తుటౌన్ సీఐ ఆత్మకూరు సత్యనారాయణ


కౌన్సెలింగ్ చేస్తున్న ద్వారకా సీఐ డీవీ రమణ


రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ చేస్తున్న సీఐ చంద్రశేఖర్

సీతమ్మధార : ఫోర్తుటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో అల్లర్లు సృష్టించినా, రౌడీయిజం చేసినా కఠిన చర్యలు తప్పవని సీఐ ఆత్మకూరు సత్యనారాయణ హెచ్చరించారు. ఈ మేరకు పోలీస్ స్టేషన్ పరిధిలో పలు కేసులతో సంబంధం ఉన్న రౌడీషీటర్లకు ఆదివారం ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. ముందుగా వారి నుంచి వేలి ముద్రలతోపాటు సంతకాలు సేకరించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు రౌడీషీటర్లపై నిఘా పెట్టామని తెలిపారు. మద్యం సేవించి షాపులు వద్ద అల్లరి చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రస్తుతం యాక్టివ్‌గా ఉన్న వారిపై సీరియస్ అయ్యారు. మంచిగా ఉంటే మంచిగా ఉంటామని, లేకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

- సమాజంలో అల్లర్లు సృష్టించకుండా ప్రశాంతంగా జీవించాలని ద్వారకా పోలీస్ స్టేషన్ ఇన్‌చార్జి సీఐ డి.వి.రమణ సూచించారు. తగాదాలు, కొట్లాటల్లో రౌడీషీటర్లు తల దూర్చకుండా కుటుంబాలతో హాయిగా జీవించాలన్నారు. ఈ మేరకు స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లుకు ఆదివారం ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. ముందుగా వారి రోజు వారీ కార్యకలాపాలపై ఆరా తీశారు. అల్లరు సృష్టిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. రౌడీషీటర్ల కదలికలపై ఎప్పటికప్పుడు పోలీస్ నిఘా ఉంటుందని, రోజు వారీ కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి ఉంటుందని పేర్కొన్నారు.

మద్రిపాలెం : కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో రౌడీయిజం చేసినా, అల్లర్లు సృష్టించినా ఊరుకునేది లేదని సీఐ చంద్రశేఖర్ హెచ్చరించారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లకు ఆదివారం ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. మద్యం తాగి గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రౌడీషీటర్లపై ఎప్పటికప్పుడు పోలీసుల నిఘా ఉంటుందని తెలిపారు. అందరూ సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. అనంతరం వారి నుంచి వేలిముద్రలు, సంతకాలు సేకరించారు.

రేపు పెందుర్తిలో జాబ్‌మేళా

పెందుర్తి : స్కిల్ డెవలప్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో పలు ప్రైవేటు కంపెనీల్లో ఉపాధి నిమిత్తం మంగళవారం స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.చంద్రశేఖర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. వివిధ కంపెనీల్లో 250 పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, ఇంజినీరింగ్ ఉత్తీర్ణత కలిగి, 18–35 ఏళ్ల మధ్య వయస్సువారు. ఇంటర్వ్యూలకు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు 77025 06614 నెంబర్లో సంప్రదించాలని సూచించారు.

తిరుగు ప్రయాణంతో సందడి


రామాటాకీస్ వద్ద ప్రయాణికులు

సీతంపేట : సంక్రాంతి సెలవులు ముగియడంతో దూర ప్రాంతాల నుంచి నగరానికి వచ్చిన వారు తిరుగు పయనమయ్యారు. ఉన్నత చదువులు, ఉద్యోగ రీత్యా హైదరాబాద్, చెన్నై, బెంగళూరు వంటి దూర ప్రాంతాల్లో ఉన్న వారు సంక్రాంతికి విశాఖ వచ్చారు. పండగ సెలవులు ముగియడంతో ఆదివారం తమ నగరాలకు పయనమయ్యారు. దీంతో రామాటాకీస్ వద్ద ప్రైవేటు ట్రావెల్ బస్సుల వద్ద రద్దీ నెలకొంది. ఉదయం 11 గంటల నుంచి ట్రావెల్ బస్సులు బారులు తీరాయి. బస్సులు ఎక్కడానికి వచ్చిన వారు, వారిని సాగనంపడానికి వచ్చిన వారితో రామాటాకీస్ రోడ్ సందడిగా మారింది.

అంబేడ్కర్‌ను అవమానించిన అమిత్‌షా గోబ్యాక్



జీవీఎంసీ గాంధీ పార్కులో నిరసన తెలుపుతున్న వామపక్ష నాయకులు

సీతమ్మధార: భారత రాజ్యాంగ రూపకర్త అంబేడ్కర్‌పై రాజ్యసభలో అవమానకర రీతిలో వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా విజయవాడ పర్యటన నుండి వెనక్కి పోవాలని వామపక్ష పార్టీలు డిమాండ్ చేశాయి. 19న రాష్ట్రవ్యాప్త నిరసనలకు వామపక్ష పార్టీలు పిలుపునిచ్చిన నేపథ్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద సీపీఎం, సీపీఐ, సీపీఐఎంఎల్ (న్యూడెమోక్రసీ), సీపీఐ ఎంఎల్ ప్రజాపోరు పార్టీల సంయుక్త ఆధ్వర్యంలో నిరసన చేపట్టాయి. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, సీపీఐ జిల్లా సమితి సభ్యులు జి.ఎ స్.అచ్యుతరావు, న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఎం.వెంకటేశ్వరరావు, ప్రజాపోరు జిల్లా కార్యదర్శి దేవాలు మాట్లాడారు. 75వ రాజ్యాంగ వార్షికోత్సవం సందర్భంగా రాజ్యసభలో ప్రతిపక్ష పార్టీలు అంబేడ్కర్ రచించిన రాజ్యాంగానికి సవరణలు చేసేందుకు పూనుకోవడం, రాజ్యాంగ హక్కులను హరించడం సరైంది కాదని నినదించడంతో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా అంబేడ్కర్‌ను అభిమానించే వారిని ఎగతాళి చేస్తూ మాట్లాడారన్నారు. అంబేడ్కర్ జపం చేయడం ఫ్యాషన్‌గా మారిందని, ఆయన జపం కన్నా దేవుడిని తలచుకుంటే స్వర్గమన్నా వచ్చేదంటూ వ్యాఖ్యానించడం దురదృష్టకరమన్నారు. ప్రధాని కూడా అమిత్‌షాను వెనకేసుకు రావడం దేశానికే అవమానకరమన్నారు. దేశ వ్యాప్తంగా ఆగ్రహావేశాలు పెల్లుబికినా, నిరసనలు వెల్లువెత్తినా బీజేపీ వైఖరిలో మార్పు లేదని దుయ్యబట్టారు. రాజ్యాంగంపై ప్రమాణం చేసి పదవి చేపట్టిన మతోన్మాదులకు అంబేడ్కర్ అంటే ఎందుకంత భయం అని ప్రశ్నించారు. రాష్ట్రంలో అన్ని తరగతులు, వర్గాల ప్రజానీకం, సామాజిక, ప్రజాసంఘాలు కేంద్ర ప్రభుత్వ వైఖరిని ఎండగట్టినా చంద్రబాబు, పవన్ కల్యాణ్, కూటమి పెద్దలు ఏమాత్రం నోరు మెదపకపోగా విజయవాడకు వచ్చిన అమిత్‌షాకు స్వాగతం పలకడం సరైంది కాదన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులకు దళితుల పట్ల, రాజ్యాంగ విలువల పట్ల చిత్తశుద్ధి లేదన్నారు. తక్షణమే అమిత్‌షాను ఏపీ నుండి వెనక్కి పంపాలని, రాష్ట్రంలో పర్యటనలకు అనుమతించరాదని డిమాండ్ చేశారు. బి.పద్మ, బొట్టా ఈశ్వరమ్మ, డి.అప్పలరాజు, కుమార్, ఎం.సుబ్బారావు, వై.రాజు, మాధవి, కె.కుమారి, చంద్రశేఖర్, రెహ్మాన్, బేగం తదితరులు పాల్గొన్నారు.